ప్రజాశక్తి
ఆదివారం 23 మార్చి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మేయర్‌పై అవిశ్వాసం

◆ కలెక్టర్‌కు నోటీసు ఇచ్చిన కూటమి కార్పొరేటర్లు

◆ తారుమారైన బలాబలాలతో హరివెంకట కుమారికి ఉద్వాసన తప్పదా ?

కలెక్టర్‌కు అవిశ్వాసంపై లెటర్ అందజేసి వస్తున్న కూటమి కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి మేయర్ పీఠమే లక్ష్యంగా కూటమి పావులు కదిపింది. ఈ క్రమంలోనే జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తూ టిడిపి, జనసేన, బిజెపి కార్పొరేటర్లు ఎమ్మెల్యేలతో శనివారం సాయంత్రం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ డాక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు నోటీసు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వెలుపల టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి మాట్లాడుతూ మేయర్ పీఠం కూటమి వశం కాబోతోందన్నారు. జనసేన అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ జివిఎంసిలో జరిగిన అవినీతి, అన్యాయాన్ని అరికట్టడానికే ఈ అవిశ్వాస తీర్మానం పెట్టామన్నారు. ఆ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ బలం లేకున్నా వైసిపి నాయకులు ఇంకా పదవులు పట్టుకుని వేలాడుతున్నారన్నారు.

కూటమి లెక్కలు ఇలా..

మేయర్ పీఠాన్ని కైవశం చేసుకోవాలని కూటమి పార్టీలు చేసిన విశ్వ ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చినట్లుగా చెప్పొచ్చు. చట్ట ప్రకారం నాలుగు సంవత్సరాల తర్వాత మాత్రమే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉండటంతో ఇప్పటి వరకూ కూటమి నేతలు ఆ జోలికి పోలేదు. అయితే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పిదప జివిఎంసిలో తమ బలాన్ని పెంచుకునేందుకు వ్యూహాలు రచించారు. కొంతమంది వైసిపి కార్పొరేటర్లను తమ వైపునకు తిప్పుకున్నారు. అ లెక్కలన్నీ సరిపోయాక మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సిద్ధమై శనివారం రంగంలోకి దిగారు.

నాలుగేళ్ల క్రితం జరిగిన జివిఎంసి ఎన్నికలలో 98 వార్డుల్లో మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ఉక్కు దీక్షలు @ 1500 రోజులు

ఐక్య పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకుంటాం : పోరాట కమిటీ నాయకులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1500వ రోజుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో పోరాట కమిటీ నాయకులు, ఉక్కు కార్మికులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. అనంతరం నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ త్యాగాలతో ఏర్పాటైన వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నేటికీ కుట్రలను కొనసాగిస్తోందన్నారు. వాటిని ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని స్పష్టం చేశారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

ఎవరి మేలుకోరి ఈ మౌనం..!

▶ వార్త 2లో..

మరోసారి పోలీసు బదిలీలు

▶ వార్త 2లో..

పరిశ్రమల కాలుష్యం నుండి రక్షించాలి

▶ వార్త 8లో..

నాలుగేళ్ల క్రితం హత్య కేసు ఛేదన

ఇద్దరు నిందితులు అరెస్టు

కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో నాలుగేళ్ల క్రితం సంచలనం సృష్టించిన రౌడీ షీటర్ హత్య కేసును కంచరపాలెం పోలీసులు ఛేధించారు. దీనికి సంబంధించి విశాఖ నగర పోలీసు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసు వివరాలను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. 2021 ఏప్రిల్ 22న కంచరపాలెం మెట్టు, పైడిమాంబ గుడి సమీపంలో ఒక వ్యక్తి మర్మాంగాన్ని కోసి, దారుణంగా హత్య చేశారు. అతని మృతదేహాన్ని సర్వీస్ రోడ్డులో పడేశారు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు గనగళ్ల శ్రీనుగా గుర్తించారు. అతని అన్న కుమారుడు గనగళ్ల ధనరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ సాగించారు. చాలా కాలం కేసులో ఎటువంటి పురోగతీ లేనందున కేసును అన్ డిటెక్టబుల్‌గా ట్రీట్ చేస్తూ ఆగస్టు 2022లో క్లోజ్ చేశారు. ఆ తరువాత మూసివేసిన కేసులను ఒకటి తర్వాత ఒకటి డిటెక్ట్ చేయాలనే నిర్ణయంపై మొదటి ప్రయత్నంగా మూడు సంవత్సరాలు క్రితం మూసివేయబడిన కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన మిగతా 2లో..

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట

◆ కంపెనీల యాజమాన్యాలకు నిర్లక్ష్యం తగదు

◆ క్రైసిస్ మేనేజ్‌మెంట్ సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలని, తరుచూ మాక్ డ్రిల్స్ నిర్వహించి కార్మికులను, ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను, పరిశ్రమల నిర్వాహకులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. పరిశ్రమల్లో పని చేసే సిబ్బందికి ప్రమాదాల నుంచి తప్పించుకోవటం ఎలా అనే అంశంపై శిక్షణ ఇవ్వాలన్నారు. తప్పనిసరిగా వారికి బీమా పాలసీ చేయించాలని ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో శనివారం వివిధ విభాగాల అధికారులు, పరిశ్రమల నిర్వాహకులతో కూడిన జిల్లా క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ మీటింగ్‌ను కలెక్టర్ నిర్వహించారు. పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రాణ నష్టం లేని విధంగా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, అన్ని చోట్లా ఆటోమెటిక్ అలారం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మెకానిజం ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, కంపెనీల యాజమాన్యాలను ఆదేశించారు. రెండు కిలోమీటర్ల పరిధి వరకు ప్రమాద జోన్‌గా గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్మికులకు అన్ని రకాల వసతులు కల్పించాలని, పర్యావరణహిత విధానాలకు ప్రాధాన్యం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మేయర్‌పై అవిశ్వాసం

టిడిపి 30 స్థానాల్లో గెలుపొందగా, జనసేన 3, బిజెపి ఒక స్థానంలో గెలుపొందాయి. సిపిఎం, సిపిఐ ఒక్కొక్క స్థానాన్ని దక్కించుకున్నాయి. ఎన్నికలు జరిగిన కొద్ది నెలలలోనే 31వ వార్డు టిడిపి కార్పొరేటర్ వానపల్లి రవికుమార్ మరణించడంతో అక్కడ ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల్లో ఆ స్థానంలో వైసిపి గెలుపొందింది. దీంతో టిడిపి బలం 29కి తగ్గింది. నాడు 64 స్థానాల్లో గెలుపొందిన వైసిపి బలంగా ఉండేది. దీంతో మేయర్, రెండు డిప్యూటీ మేయర్ పదవులను ఆ పార్టీ కైవశం చేసుకుంది. ఇప్పుడు పరిస్థితులు తారుమారు కావడంతో వైసిపి కార్పొరేటర్ల సంఖ్య 34కి పడిపోయింది. వీరిలో మరో ఇద్దరు పార్టీ మారడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అనకాపల్లి చెందిన వైసిపి కార్పొరేటర్లు కొణతాల సుధ, పీలా లక్ష్మీ సౌజన్య వైసిపి వీడి ఒకరు జనసేనలోకి, మరొకరు టిడిపిలోకి వెళ్లడానికి సిద్ధమయ్యారు. వీరిద్దరూ శనివారం కలెక్టరేట్‌కు మేయర్‌పై అవిశ్వాస తీర్మాన పత్రం సమర్పణకు హాజరయ్యారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడానికి అవసరమైన కార్పొరేటర్ల సంఖ్య 53 ఉంటే చాలు. ఆ బలం ఇప్పుడు కూటమికి ఉంది. ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా ఉండే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు అవిశ్వాస తీర్మానంపై జరిగే ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. దీంతో శనివారం కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానానికి సరిపడినంతగా 53 మంది కార్పొరేటర్ల సంతకాలతో కూడిన లేఖను కూటమి నాయకులు అందజేశారు.

కూటమికి 12 మంది ఎక్స్ అఫీషియో సభ్యుల మద్దతు

ఇదిలా ఉండగా 2024 ఎన్నికల తర్వాత మారిన రాజకీయ పరిస్థితులలో జివిఎంసి పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలు, పార్లమెంటు స్థానాలను కూటమి గెలుచుకుంది. దీంతో జివిఎంసిలో ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా వారందరికీ ఓటు హక్కు ఉంటుంది. వీరి సంఖ్య 12గా ఉంది. ఇద్దరు పార్లమెంట్ సభ్యులు, ఇద్దరు ఎమ్మెల్సీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కూటమికి ఉన్నారు. ఇక వైసిపికి ఒక రాజ్యసభ సభ్యుడు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఓటర్లుగా ఉన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట

ఇవ్వాలని అన్నారు. అన్ని చోట్లా ఎమెర్జెన్సీ రెస్పాన్స్ టీంలను అందుబాటులో ఉంచాలన్నారు. కార్మికులు, ప్రజల ప్రాణాల విషయంలో ఎవరూ నిర్లక్ష్యం ప్రదర్శించడానికి వీల్లేదని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీల చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం ఆదిశేషు, డిఎఫ్ఒ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల క్రితం హత్య కేసు ఛేదన

హత్య కేసును తెరిచారు. సిఐ షేక్ హుస్సేన్ నాయకత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసులో విచారణ జరిపింది. అనకాపల్లికి చెందిన లాలం గణేష్, పెద గంట్యాడకు చెందిన తారకేశ్వరరావు పాతకక్షల నేపథ్యంలో ఈ హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులను సిపి అభినందించారు.

ఉక్కు రక్షణ నినాదాలు చేస్తున్న నాయకులు

ఉక్కు కార్మికుల తొలగింపును రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రక్షించేందుకు ప్యాకేజీ తెచ్చామని ఊదరగొట్టి ఉపన్యాసాలు చేస్తున్న టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌లోని కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల అక్రమ తొలగింపులను అడ్డుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాటంలో భాగంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపు మేరకు లక్ష కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ మద్దిలపాలెం సిఐటియు జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉక్కు పరిరక్షణ నినాదాలు చేశారు. అక్కడి వారందరికీ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాకేజీగా వచ్చిన డబ్బుల్లో ఒక్క రూపాయి కూడా కార్మికుల ప్రయోజనాలకు, ఉత్పత్తికి ఖర్చు చేయలేదన్నారు. ఇలా అయితే ఏ రకంగా లాభాలొస్తాయని ప్రశ్నించారు. చాపకింద నీరులా కాంట్రాక్ట్ కార్మికులను 4500 మందిని, పర్మినెంట్ కార్మికులను మరో 2500 మంది తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. కార్మికులను క్రమేపీ తగ్గించి నష్టాలు చూపి ప్రైవేట్‌వారికి ప్లాంట్‌ను కట్టబెట్టాలనే కుట్ర సాగుతోందన్నారు. పోరాటాలతో దాన్ని తిప్పికొడతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, ఉపాధ్యక్షులు కె.కుమారి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.కృష్ణారావు, తోపుడుబండ్ల సంఘం నాయకులు ఎ.సింహాచలం, ఎ.అప్పారావు, రమేష్, శ్రీను, సిఐటియు సీనియర్ నాయకులు జి.పోలేశ్వరరావు పాల్గొన్నారు.

ఎవరి మేలుకోరి ఈ మౌనం..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కూటమి ప్రజా ప్రతినిధుల కళ్లకు కనబడకుండా ఏ పొరలు అడ్డుపడుతున్నాయో తెలీదుగానీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జరుగుతున్న ఏ వినాశ సృష్టిపైనా నోరు విప్పడంలేదు. ఎన్నికల ముందు గెలవడానికి చెప్పిన కబుర్లు, ఇచ్చిన మాటలేవీ వారికి గుర్తున్నట్లులేవు. ప్రజలు గుణపాఠం చెప్పే వరకు వీరు గుర్తెరిగేలా లేరు. ఓటమితో వైసిపి చతికలపడింది. ఆవహించిన అధికార మదంతో కూటమి వాస్తవం గుర్తించ నిరాకరిస్తోంది. గెలిపించిన ప్రజలకు కీడు తప్ప మేలు చేసే మాటలు వారినోటి నుంచి ఈ కాలంలో రాలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తగలబెట్టడానికి మోడీ ప్రభుత్వం పెట్టిన నిప్పుతో చలికాచుకోవడానికి జిల్లా కూటమి ప్రజా ప్రతినిధులు సిద్ధపడుతున్నారేగానీ ఆ ముప్పును ఎదుర్కొనే సాహసం చేయడంలేదు. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న కార్మికులు, ఉద్యోగుల పోరాటానికి బహిరంగ సంఘీభావం ప్రకటించి గనుల సాధన, సెయిల్‌లో విలీన ప్రకటన వెలువడే వరకు మీ వెంట మేముంటామని నిలబడ్డానికి వారికి వెన్నుముక వున్నట్లు లేదు. స్టీల్‌ప్లాంట్‌లో వేలాది మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపును అడ్డుకోకుండా ఏ గుడ్డి గుర్రానికో పళ్ల తోమడానికి టిడిపి, జనసేన, బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలు వెళ్లారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పదవుల ఆశలో కార్మికులను వదిలి విన్యాసాలు చేస్తే వారు మౌనందాల్చారు. కుటుంబాలన్నీ తిరగబడతాయి. ఆ విషయాన్ని గుర్తెరగాలి. స్టీల్‌ప్లాంట్‌పై పిల్లి మొగ్గలు వేసినట్లే... గ్రామీణ ప్రాంతంలో క్రషింగ్ నిలిపివేసిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపైనా ప్రజాప్రతినిధులు కప్ప గెంతులు వేస్తున్నారు. తిరిగి క్రషింగ్ జరిగేలా తామంతా కలిసి కృషి చేస్తామని ఎమ్మెల్యేలెవరూ చెప్పడంలేదు. జనసేనలో చేరక తరువాత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్వర శబ్దం బలహీనపడింది. ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయంపై గట్టిగా నోరువిప్పడం మానేశారు. గోవాడ సహకార సుగర్ ఫ్యాక్టరీని

ఆధునీకరిస్తామన్న మాట మర్చిపోయారు. రోజుకు నాలుగువేల టన్నుల క్రషింగ్ సామర్థ్యం కలిగిన గోవాడ ఫ్యాక్టరీ, ఈ ఏడాది సగటున 1500 టన్నులకు మించి ఆడ్డలేదు. చెరుకు సరఫరా చేసిన రైతుకు బిల్లులు, కంపెనీ కార్మికులకు జీతం చెల్లించలేదు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ నేతృత్వంలో బకాయిలు చెల్లించాలని, ఫ్యాక్టరీ ఆధునికీకరణకు రూ.350 కోట్లు విడుదల చేయాలని రైతులు ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేపట్టారు. బకాయిలు ఇవ్వకపోతే ఈ పోరాటం విస్తృతం కానుంది. తన పొలంలోనే చెరుకు పంటకు నిప్పు పెట్టుకున్న పరిస్థితి దేవరాపల్లి రైతుకు ఎందుకొచ్చిందని ఎమ్మెల్యేలు ఆలోచిస్తే కనీసం జవాబైనా దొరుకుతుంది.

కాకినాడ తీర ప్రాంతంలో ప్రజలు ప్రతిఘటించిన బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లిలో ఏర్పాటుచేయనారంభించినా, అనకాపల్లి జిల్లా తీరంలో అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపైనా వారెవరూ మాట్లాడటం లేదు. నాతవరం మండలంలో లేటరైట్ అక్రమంగా తవ్వకుపోతున్నా నోరు విప్పడం లేదు. నీటిపారుదల ప్రాజెక్టులకు సరిపడా నిధులు కేటాయించకపోయినా ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం లేదు. కాలుష్యంతో ప్రజలు బాధలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. పరిశ్రమల్లో స్థానిక యువతకు విద్యార్హతలకు తగిన ఉపాధి కల్పించకపోయినా కలుగజేసుకోవడం లేదు. తాండవ, రైవాడ జలాశయ నీటి వనరులపై అదానీ, షిర్డీ సాయి కంపెనీలు ఏజెన్సీలో హైడల్ పవర్ పంప్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సిద్ధపడుతున్నా వ్యతిరేకించడం లేదు. కూటమి ప్రజా ప్రతినిధులు ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నారో, ఎవరి ప్రయోజనాలను కాపాడుతున్నారో ఇప్పటికే ప్రజలకు అర్థమైవుండాలి. స్వర్ణాంధ్రప్రదేశ్ స్వప్నంలో ప్రభుత్వం విస్మరిస్తున్న ప్రజా సమస్యలు సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో వెలుగులోకి వస్తున్నాయి. ఈ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ప్రజలు పోరాట మార్గాలను ఎంచుకుంటారు.

నేడు కళాకారులకు జిల్లా స్థాయి అవార్డులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రైల్వే న్యూ కాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో విశాఖ జిల్లాలో అత్యంత ప్రతిభ కనబరిచిన కళాకారులను కళా ప్రవీణ 2025 పురస్కారాలతో సత్కరించనున్నట్లు సంఘం గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు కె.జనార్ధన్ తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ఆ వివరాలను వెల్లడించారు. విశాఖ జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కళాకారులను ఎంపిక చేసి ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. విభిన్న కళా రంగాలకు చెందిన కళాకారులు సుమారు 2000 మంది ఈ సంఘంలో సభ్యులుగా ఉన్నారన్నారు. కళాకారుల్లో ఐక్యతను పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేశారు. మీడియా సమావేశంలో ఇంటర్నేషనల్ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజ్ పట్నాయక్, సినీ డైరెక్టర్ యాదకుమార్ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ శిక్షణా శిబిరానికి ఐదుగురు విద్యార్థులు

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 24 నుంచి 28 వరకు భువనేశ్వర్‌లో తల పెట్టిన రాష్ట్ర స్థాయి స్టడీ జూనియర్ రెడ్ క్రాస్ ట్రైనింగ్ క్యాంపునకు విశాఖపట్నం జిల్లా శ్రీ శారద విద్యా నిలయం స్కూల్‌కు చెందిన జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు ఐదుగురు ఎంపిక య్యారు. వారిని విశాఖపట్నం రెడ్ క్రాస్ శాఖ ద్వారా అక్కడకు పంపనున్నారు. దీనిలో భాగంగా శనివారం శ్రీ శారద విద్యాలయం స్కూల్ ప్రిన్సిపాల్ పీడీ ఎల్ఎన్.(శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ పి.రవికుమార్ (జెఆర్‌సి), ఎమ్‌డి రెహంతుల్లా, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ సంతోష్ రెడ్ క్రాస్ జెండా ఊపి అభినందనలు తెలుపుతూ పంపించారు.

మరోసారి పోలీసు బదిలీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరోసారి పలువురు పోలీస్ సిబ్బందిని బదిలీ చేస్తూ సిపి శంఖబ్రత బాగ్చి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో నాలుగో పట్టణ క్రైమ్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.సత్యారావు ఉన్నారు. ఆయనను ఆనందపురం క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. భీమిలి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం.సింహాచలంను ఆనందపురం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు, సిటీ స్పెషల్ బ్రాంచ్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పి.చిట్టి కుమార్‌ను ఆరిలోవ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు, సిటీ స్పెషల్ బ్రాంచ్‌లోని మరొక ఎఎస్ఐ టి.శివరామకృష్ణను వన్ టౌన్ లాండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరితోపాటు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉమెన్ హెడ్ కానిస్టేబుల్స్, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, ఒక ఉమెన్ కానిస్టేబుల్, 8 మంది కానిస్టేబుళ్లను వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు. ఈ బదిలీలు తక్షణమే అమలులోకి వస్తాయని, బదిలీలు పొందిన వారు వెంటనే వారి వారి స్థానాల్లో రిపోర్ట్ చేయాలని సిపి ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ నెలలో ఈ విధంగా సిబ్బందిని బదిలీ చేయటం వరుసగా రెండో సారి.

IN THE HONOURABLE COURT OF PRINCIPLE CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
O.S. NO. 427/2023 in
I.A. NO. 570/2024

Between:
Smt. Pothuraju Varalakshmi, W/o. Nageswara Rao. Resident D.No. 44-7-1/43, Flat No. 203 Muppidi Enclave, Lakshmi Narayanapuram-II, Thatichetla Palem, Visakhapatnam-530016.
. . . Petitioner/Plaintiff
And:
Smt. A.S.L.N.V. Chandrakala, W/o. Banala Murali. D. No. 29-2-31, Flat No. 403, Hemalatha Towers Dabagardens, Visakhapatnam - 530 020 & D. No. 6-13-24, 2nd Floor, Varalakshmi Abode East Point "C", Dobhi Street, Near: Mental Hospital Down, China Waltair, Visakhapatnam.
. . . Respondent / Defendant

NOTICE

Please take notice that the above I.A. No. 570/2024 is filed to pass final decree in terms of preliminary decree dated 07.03.2024 in order to put suit mentioned property for sale to recover the decree amount and the matter stands posted to **10.04.2025** for your notice and you are required to attend before the Honourable Court on that day i.e. **10.04.2025 by 10.30 AM** and failing to do so, the Honourable Court may proceed further at your absence.

S.NAGESH KUMAR
V(G) VIJAYA
Advocates, Flat No. 104, Ground Floor, Shree Ganesh Enclave, Dondaparthi, Near Yerukamamba Temple, Visakhapatnam - 530016
Cell : 9848282374, 8106523333
Visakhapatnam
Date: 22.03.2025

IN THE HONOURABLE COURT OF V ADDL DISTRICT JUDGE-CUM-FAMILY JUDGE AT VISAKHAPATNAM
F.C.O.P. 2088/2023

Between:
M.L.N.Patnaik . . . Petitioner
And:
Smt.M.(V.) Tarakeswari @ Swathi
. . . Respondent
Smt. Medepalli (V.) Tarakeswari @ Swathi, W/o M.L.N.Kalyan Patnaik, D/o V.T.Satya Somesekhar Raju, Hindu, aged 28 years, Housewife, D.No.9-156/3, Narasimha Nagar, Road-1, Gopalapatnam, Visakhapatnam - 530027.

NOTICE

Please take notice that the above named petitioner has instituted the above case against you and the same stands posted to **24-04-2025** for your appearance, on that day at **10:30 A.M.** You should appear before the aforesaid Honourable Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence as exparte.

N.J.SUKUMAR
Advocate
Visakhapatnam.
Mobile: 9848410548.

IN THE HON'BLE COURT OF THE METROPOLITAN SESSIONS JUDGE AT: VISAKHAPATNAM
Crl. M.P. 306/2023 in
Crl. Appeal No. /2023

Between:
Dasari Markandeya Rao
...Petitioner/Appellant
And:
Malla Reddy Venkata Lakshmi & 9 others ...Respondents/Respondents

NOTICE

To,
R-1: Malla Reddy Venkata Lakshmi, W/o. Surya Chandra, aged 35 years, R/at SF 3, Kalyan Seetharama Residency, Pithapuram Colony, Visakhapatnam.
R-4: Nayina Govinda Reddy S/o. Krishna Reddy, aged 40 years, R/at D.No. 26-7-55, Panda Veedhi, Opp. KalyanTraders, Poorna Market, Visakhapatnam.
R-9: Gutala Anuradha, W/o. Nooka Raju, aged 50 years, R/at D.No.8-62/9, Vidya Nagar, Opp. Old CBI, China Waltair, Visakhapatnam.
R-10: Neeli Anand, S/o. Pathi Rao, aged 36 years, R/at D.No.8-36, Sai Soudha Nagar, Papayaraju Palem, LIC Colony, Pendurthy, Visakhapatnam.

Please take notice that the above named Petitioner/ Appellant has has filed the above Crl. MP against all of you and the matter stands posted to **07-04-2025** for your appearance. Therefore, you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **07-04-2025** at **10:30 A.M** in the above Court, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
KADIRI RAMU,
Advocate, Visakhapatnam.

ఘనంగా గీతం వైద్య పట్టభద్రుల దినోత్సవం

305 మందికి డిగ్రీల ప్రదానం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్), గీతం దంత వైద్య కళాశాల నుంచి వైద్య విద్యను పూర్తి చేసుకున్న 305 మంది విద్యార్థులకు పట్టభద్రుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 132 మంది విద్యార్థులు ఎమ్‌బిబిఎస్, 122 మంది బిడిఎస్, 51 మంది ఎమ్‌డి డిగ్రీలను అందుకున్నారు. కార్యక్రమానికి ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చి (ఐసిఎమ్ఆర్) మాజీ డైరక్టర్ జనరల్ ప్రొఫెసర్ బలరామ్ భార్గవ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, భారతీయ వైద్య నిపుణులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. దేశంలో తయారైన 60 శాతం ఔషధాలు, టీకాలు 100కు పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. విశాఖ ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో వైద్యానికి ప్రాచుర్యం కల్పించడం ద్వారా అవకాశాలను పెంచుకోవాలన్నారు. వైద్య రంగంలో నూతన పరిజ్ఞానం అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే వైద్యుల పరిధి విస్తరిస్తుందన్నారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యరోల్ డిసౌజా మాట్లాడుతూ, గీతం ప్రగతిని వివరిస్తూ వైద్య రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను తెలియజేశారు. ఈ పట్టభద్రుల దినోత్సవంలో ఇద్దరు విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. జిమ్సర్, దంత వైద్య కళాశాల వార్షిక నివేదికను జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు సమర్పించారు. నిరంతర వైద్య విద్య కార్యక్రమాలకు, పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. జిమ్సర్ ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి వైద్య వృత్తిలో విలువలను కాపాడుకుంటూ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.నరసింహారావు, గీతం పాలకమండలి సభ్యులు, గీతం సలహాదారు ప్రొఫెసర్ జి.సుర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రుల దినోత్సవంలో భాగంగా గీతం విద్యార్థులతో విలువలతో వైద్య వృత్తిని నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

డిగ్రీలను ప్రదానం చేస్తున్న అతిథులు

వీరబ్రహ్మానికి ప్రశంసాపత్రం అందిస్తున్న డిఎంహెచ్ఒ డిటిసిఒ, డిసిహెచ్ఎస్

ఉత్తమ ల్యాబ్ సూపర్‌వైజర్‌కు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-మధురవాడ : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ హాల్‌లో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉత్తమ ల్యాబ్ సూపర్‌వైజర్‌గా మధురవాడ టిబీ యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మానికి డిఎంహెచ్ఒ జగదీశ్వరరావు ప్రశంసాపత్రం అందించారు.

కెజిబివిల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామపంచాయతీలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం కెజిబివి రాష్ట్ర సెక్రటరీ డి.దేవానందరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఆనందపురం : ఆనందపురం నేలతేరు కెజిబివిని దేవానందరెడ్డి సందర్శించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తక పఠనంపై విజ్ఞానాన్ని పరిశీలించారు. బయాలజీని 25 నిమిషాలు పాటు విద్యార్థినులతో చదివించి, చదవడం ద్వారా గ్రహించిన విషయాన్ని తరగతిలో వారితోనే చెప్పించారు. ప్రశ్నలు అడిగించారు. అదే అంశంపై విద్యార్థినుల చేతనే ప్రశ్నలు-సమాధానాలతో నోట్స్ రాయించారు. తనిఖీ చేసిన రెండు పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు పరిశీలన

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస పెద్దచెరువును మండల సర్వేయర్ రమేష్, విఆర్ఒ శ్రీనివాసరావు, సిబ్బంది శనివారం పరిశీలించారు. సంబంధిత చెరువు విస్తీర్ణం 36 ఎకరాల 40 సెంట్లను సర్వే చేసి ఆక్రమణలు ఉంటే తొలగించాలన్న టిడిపి జిల్లా కార్యదర్శి పిట్ట సురేష్ గతంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఇందుకు స్పందించి రెవెన్యూ అధికారులు చెరువును, మ్యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సురేష్,

కఠోర శ్రమతోనే లక్ష్య సాధన

అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి

సర్టిఫికెట్లు అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : కఠోర శ్రమ ద్వారానే లక్ష్య సాధన సాధ్యమని అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అవంతి యన్స్ గ్రాడ్యుయేషన్ డే, అచీవర్స్ డే వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరంతరం కృషి చేస్తేనే సక్సెస్ సాధ్యమని విద్యార్థులకు స్పష్టం చేశారు. జెఎన్‌టియు జివి విజయనగరం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, తల్లిదండ్రులు గర్వించేలా ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. చిప్పాడ దివీస్ సంస్థ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్.రావు మాట్లాడుతూ, ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అనేది ఫార్మసీ, వైద్య రంగాల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని నొక్కి చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై నైపుణ్యత సాధించాలని సూచించారు. విశాఖ, సింబోసిస్ టెక్నాలజీ సిఇఒ ఒ.నరేష్‌కుమార్ మాట్లాడుతూ, అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. అనంతరం అవంతి విద్యా సంస్థల్లో పట్టభద్రులైన ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, డిగ్రీ విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. 1520 మంది గ్రాడ్యుయేషన్ పట్టాలు, 1137 మంది ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు. అవంతి విద్యా సంస్థల డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ప్రిన్సిపల్స్ బి.మురళీకృష్ణ, మోహనరావు, గోవిందరావు, జాషువా జయప్రసాద్, ఎంబివి.రాజు, పి.రామకృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారులు టి.శ్రీనివాసరావు, సుందర్, పలువురు అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పందిరి రాముకు నివాళి

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ పరిధి శివశక్తినగర్‌లో ప్రజా నాట్య మండలి కళాకారుడు పందిరి రాము ఇంటి వద్ద సంస్మరణ సభ ఏర్పాటుచేశారు. రాము చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ప్రజా నాట్య మండలి కార్యదర్శి ఎం.చంటి, కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, కమ్యూనిస్టుగా చివరివరకూ పోరాటాలతో కొనసాగారని తెలిపారు. తనగాత్రం ద్వారా అనేక పాటలు పాడుతూ కార్యక్రమాలకు నిండుతనం తెచ్చేవారని పేర్కొన్నారు. సమాజంలో ప్రజలను చైతన్య పరచడానికి ఉన్న పాటలను తన గాత్రంతో ఆలపించి, ఉర్రూతలూగించే వారిని గుర్తు చేసుకున్నారు. పందిరి రాము ఆశయాల సాధనకు కృషి చేసినప్పుడే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎన్.సూర్యప్రకాష్, ఎస్ఎల్.నాయుడు, సిపిఎం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, డి.అప్పలరాజు ఐద్వా నాయకులు బి.భారతి, కె.సుజాత, బాలల సంఘం బాధ్యులు డి.శైలు, సిఐటియు నాయకులు డి.కొండమ్మ, పి.రాజుకుమార్, కెవిపిఎస్ నాయకులు ఎస్.పైడితల్లి, ఫాస్టర్ బి.కేశవయ్య పాల్గొన్నారు.

పందిరి రాము సంస్మరణ సభలో పాటలు పాడుతున్న కళాకారులు

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కెజిబివిలో 2025 -26 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 11వ తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ గంగాకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 6వ తరగతిలో 40, ఇంటర్ ప్రథమ ఏడాదిలో 40, ద్వితీయ ఏడాదిలో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అనాథలు, డ్రాపౌట్లు (బడి బయట పిల్లలు), ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలు మాత్రమే ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణింప బడతాయని తెలిపారు. ఎంపికైన బాలికలకు ఫోన్ ద్వారా మేసేజ్ వస్తుందని పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు చోట్ల 110 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి ఏపీ ఆర్ స్కూల్ వద్ద శనివారం ఆటోలో తరలిస్తున్న 100 కేజీల గంజాయిని పట్టుకున్నామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ట్రైనీ డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో ఎస్సై రమేష్ వాహన తనిఖీలు చేస్తుండగా కృష్ణదేవిపేట నుంచి తాళ్లపాలెం వెళుతున్న ఆటోను తనిఖీ చేయగా నాలుగు బ్యాగుల్లో 100 కేజీల గంజాయి లభ్యమైందన్నారు. ఇద్దరు పరారీ కాగా చింతపల్లి మండలం కోరుకొండకు చెందిన మజ్జి గాంధీ, వంతల హరిబాబు, నర్సీపట్నంకు చెందిన గుడాల పార్థకిర్తిలు పట్టుబడ్డారన్నారు. ఆటో సీజ్ చేసి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిఐ గోవిందరావు, ట్రైనీ డీఎస్పీ చైతన్య పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో 10 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. చెన్నయ్‌కు చెందిన ముహమ్మద్ అబ్బాస్, బిరేంద్ర రానా విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా తమిళనాడుకు ఈ సరుకును తరలిస్తున్నారు. వారిరువురినీ పోలీసులు అరెస్టు చేశారు. కేసును జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనంజయనాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక గొల్లలపాలేనికి చెందిన పీతల రాజేశ్వరి (28) శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రాజేశ్వరి సెల్ ఫోన్ నుంచి అదే గ్రామంలో ఉంటున్న గుడ్ల సురేష్‌కు ఫోన్ కాల్ వచ్చింది. ఇదే సమయంలో సంబంధిత కాల్‌ను అతని భార్య ఉజ్వల లిఫ్ట్ చేయడంతో పాటు ఎందుకు ఫోన్ చేయాల్సి వచ్చింది అంటూ పరుషంగా దూషించింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రాజేశ్వరి అదే రోజు ఆత్మ హత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఆమె భర్త వెంకట రమణ, కుటుంబ సభ్యులు వెంటనే సంగివలస, అనిల్ నీరు కొండ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మృతురాలికి తొమ్మిదేళ్ల కుమారుడు చైతన్య, ఏడేళ్ల కుమార్తె వర్షిణి ఉన్నారు. మృతురాలి భర్త వెంకట రమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన..

తన భార్య రాజేశ్వరి ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని బాధిత కుటుంబ సభ్యులతో పాటు కొందరు గ్రామస్తులు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. రాజేశ్వరి ఆత్మ హత్యకు కారణమైన ఉజ్వల, ఆమె భర్త సురేష్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్‌చేశారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని సిఐ బి.తిరుమల రావు చెప్పడంతో ఆందోళన విరమించారు.

దుకాణం దగ్ధం

ప్రజాశక్తి -మధురవాడ : గణేష్‌నగర్‌లోని రాజేశ్వరి కిరాణా జనరల్ స్టోర్స్‌లో శనివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చుట్టు పక్కల ప్రజలు భయాందోళన చెందారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. సుమారు రూ.20 లక్షలు వరకు ఆస్తి నష్టం జరిగిందని షాపు యజమాని కందుల శ్రీధర్ తెలిపారు. విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర కళింగ వైశ్య మాజీ బీసీ కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు తదితరులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. పిఎంపాలెం పోలీసులు సంఘటనపై ఆరా తీశారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కేసు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలోని వెంగమాంబ క్వారీ దగ్గరలో, కురపల్లి గ్రామంలో అక్రమంగా మట్టిని తవ్వుతున్న జెసిబి, ఒక లారీని శుక్రవారం రాత్రి పద్మనాభం సిఐ శ్రీధర్ ఆదేశాల మేరకు బీట్ సిబ్బంది పట్టుకున్నారు. తగు చర్య నిమిత్తం తహశీల్దార్ కె.ఆనందరావుకు సమాచారం అందించినట్లు సిఐ తెలిపారు.

ప్రభుత్వ భూముల్లోని నివాసాల పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం, రెడ్డిపల్లి పంచాయతీ పరిధి మద్రిబండ గ్రామంలో శనివారం తహశీల్దార్ ఆనందరావు పర్యటించారు. ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకొని ఉంటున్న కుటుంబాలను పరిశీలించారు. ఇంటి కరెంట్ బిల్లు, ఇంటి పన్ను తదితరాలను పరిశీలించి జిఒ 30 ప్రకారం ఇంటి పట్టా మంజూరు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల విఆర్ఒలు, మండల ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్ల కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-సీతమ్మధార : మద్దిలపాలెం ఆర్‌టిసి డిపో, సిఎంఆర్ సెంట్రల్, చిన్న వాల్తేర్ కోట స్కూల్ వద్ద వెండింగ్ బోర్డులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ జివిఎంసి జోన్ 3 కార్యాలయం వద్ద 50 మంది తోపుడు బండ్ల కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకట్రావు మాట్లాడుతూ, టివిసి, జివిఎంసి టౌన్ ప్లానింగ్ సిబ్బంది 2016లో సిఎంఆర్ సెంట్రల్, మద్దిలపాలెం సిటీ కాంప్లెక్స్ రోడ్డు ప్రక్కన వెండింగ్ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం ఆధారంగా ఏర్పాటైన వీటిని జోన్ 3 కమిషనర్ పరిశీలించకుండా తొలగించడం సరికాదన్నారు. స్ట్రీట్ వెండర్స్ చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించిన జోన్ కమిషనర్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం జోనల్ కమిషనర్ స్పందించి తొలగించిన వెండింగ్ బోర్డులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, లేనియెడల పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విశాఖపట్నం తోపుడుబండ్ల చిల్లర వర్తకల సంఘం జిల్లా కార్యదర్శి అంగుడు సింహాచలం మాట్లాడుతూ, ప్రస్తుత జోనల్ కమిషనర్ తప్పుడు పనులు చేసే తోపుడుబండ్ల నాయకులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఇచ్చిన ఫిర్యాదుతో వెండింగ్ బోర్డులను తొలగించడం సరికాదన్నారు. వెండింగ్ జోన్లు, వెల్టింగ్ బోర్డులను అక్కడే ఏర్పాటు చేయాలని జోన్ 3 కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.కుమారి, చిన్ని, ఎల్లంనాయుడు, శ్రీను, వై.సాయి, ఎం.గణేష్, ఎ.అప్పారావు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

పి4 సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా దాతృత్వ ప్రజల భాగస్వామ్యం (పి4) సర్వేలపై శనివారం పలు వార్డుల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. 11వ వార్డు పరిధి సచివాలయంలో జివిఎంసి డిఇ అప్పారావు ఆధ్వర్యాన సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్థికంగా వెనుకబడిన ఇరవై శాతం మందిని, ఆర్థికంగా సంపన్నులైన పది శాతం మద్దతుతో శక్తివంతం చేయడమే లక్ష్యంగా పి4 సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, అధ్యక్షులు ముగద రాజారావు, మూది అప్పారావు, పేపర్ నాయుడు, ఎం.కృష్ణంరాజు, పాల్గొన్నారు. 13వార్డు వార్డు పరిధి సచివాలయం 7లో ఎఇ శ్రీనివాసరావు ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు. సర్వే ప్రయోజనాలను ప్రజలకు ఎఇ వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు, మజ్జి రమణి, యల్లమిల్లి సురేష్, తురకపూడి బాలస్వామి, జనసేన నాయకులు నీలి పైడిరాజు, మాసాబత్తుల శ్రీనివాసరావు, గుంజ శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని గంభీరంలో పి4 సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఫిబ్రవరి 1 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన సర్వే నివేదికను గ్రామసభలో చదివి వినిపించారు. దారిద్ర రేఖకు దిగువ ఉన్న కొంతమందిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వానపల్లి లక్ష్మి, గ్రామ కార్యదర్శి కె.చలపతిరావు, వైస్ ప్రెసిడెంట్ బొట్ట శ్రీను పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి నరవలో ఇటీవల నిర్వహించిన పి4 సర్వేలో 370 కుటుంబాలను సర్వే చేసిన సందర్భంగా కూటమి నాయకులు బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు గల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, పి4సర్వేతో పేదలను గుర్తిస్తున్నట్లు తెలిపారు.

ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధిలో పి-4 సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన ఇన్‌ఛార్జ్ పుర్రె సురేష్ యాదవ్, బిజెపి మండల అధ్యక్షులు రామకృష్ణ, రామమోహన్‌నాయుడు, నాయకులు నక్క వంశీ, మారుతీ లక్ష్మణ్, వెంకటరావు, సిఐ మూర్తి, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి కూటమి నాయకులు శ్యామల దీపిక శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. సుమారు రూ.29.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అధికారులు, కూటమి నాయకులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రభ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి ఎన్జీవోస్ కాలనీ నుండి భరత్‌నగర్ రోడ్డుకు రూ.45 లక్షలతో రహదారి అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ పిల్లా మంగమ్మ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో వార్డులో చాలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. వార్డులో చాలాచోట్ల రోడ్లు, కాలువలు నిర్మించాల్సి ఉందని, దశలవారీగా అన్ని పనులూ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పిల్లా వెంకటరావు, వార్డు టిడిపి అధ్యక్షులు పిల్లా నరసింగరావు, కానూరి అచ్యుతరావు, మామిడి దుర్గారావు, నాగోతి సూర్యప్రకాష్, పోతిన నాయుడు పోతిన బాలాజీ, పిల్లా శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ్' జాబ్ మేళాలో 81 మంది ఎంపిక

ప్రజాశక్తి-పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 81 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఎన్ఇ ఫ్లోరా తెలిపారు. ఈ జాబ్ మేళాలో 172 మంది పాల్గొనగా డబ్ల్యూఎన్ఎస్‌కు 12 మంది, కాన్సెంట్రిక్స్‌కు 7 గురు, ఎంఆర్ఎఫ్, హ్యుందాయ్ మోబీస్‌లకు 15 మంది, ఫాక్సకాన్‌కు 47 మంది ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. ఫాక్సకాన్ కంపెనీకి ఎంపికైన వారికి కాల్ లెటర్లను కాలేజ్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.థియోఫిలస్ అందజేశారు. ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో నిర్వన్ ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరరావు, వేణుగోపాల్, ఆర్ ధనలక్ష్మి, జి. కమల రాణి, ఫాక్సకాన్ హెచ్ఆర్ ప్రవీణ్ కుమార్, యోకోహోమ టైర్స్ సెంటర్ మేనేజర్ శ్రవణ్ కుమార్, హ్యుందాయ్ మోబిస్ హెచ్ఆర్ వి.వి.రాజు, ఎంఆర్ఎఫ్ హెచ్ఆర్ చైతన్య, కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, ఎఒ జి.రవిబాబు, డి.సింహాచలం, కె.బ్యూల మెర్సీ పాల్గొన్నారు.

ఘనంగా 'చైతన్య' వార్షికోత్సవం

బంగారు పతకాలను అందజేస్తున్న రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ ఎస్‌వి.కేశవరావు

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక చైతన్య డిగ్రీ, పీజీ మహిళా కళాశాల 29వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపూజ ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ శకుంతల మాట్లాడుతూ, 1996లో ఈ కళాశాలను ఏర్పాటుచేశామని తెలిపారు. గాజువాక పరిధిలో అత్యుత్తమ విద్యా ప్రమాణాలు పాటిస్తూ మహిళలకు విద్యనందిస్తూ, ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధిలో ర్యాంకులు సాధిస్తున్నట్లు వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాంచి న్యాయకళాశాల విశ్రాంత వైస్ ఛాన్సలర్ ఎస్‌వి.కేశవరావు మాట్లాడుతూ, 29 సంవత్సరాలుగా కళాశాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దడంలో యాజమాన్యం శ్రమ, మహిళలకు విద్యను అందించడంలో పాటించిన కఠోరదీక్ష ప్రశంసనీయమని కొనియాడారు. భవిష్యత్తు అంతా మెషిన్ లెర్నింగ్ మీద ఆధారపడి ఉంటుందని, అవి నేర్చుకుంటూ భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం పీజీ, యుజీలో ఉత్తమ ర్యాంకులను సాధించిన ఐ.రమ్య, బి.మౌనిక, మంత్రి రమాభాయ్, లక్ష్మి ప్రసన్నకు బంగారు పతకాలు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమహాలక్ష్మి, కరస్పాండెంట్ విజయలక్ష్మి, డైరెక్టర్ కామేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



రక్తదానం చేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

దయాల్‌నగర్‌లో రక్తదానం

ప్రజాశక్తి -గాజువాక : అర్క ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వందే భారత్ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో దయాల్‌నగర్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ, సమ సమాజ స్థాపనకు కృషి చేస్తూ, మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువతకు ఎల్లప్పుడూ తన ప్రోత్సాహం ఉంటుందన్నారు. రక్తదానం చేయండి ప్రాణాలు కాపాడండి అని నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో వినోద్‌బాబు, అనపర్తి త్రినాథ్, భీశెట్టి పవన్‌కుమార్, ఆడారి బాలశ్రీను, బుద్ధా నాగేశ్వరరావు, భీశెట్టి శ్రీను, పాల్గొన్నారు.

ఇటలీ దేశస్తులను కాపాడిన మెరైన్ సిబ్బంది

ప్రజాశక్తి -గాజువాక : యారాడ బీచ్‌లో శనివారం స్నానం చేస్తూ సముద్రం లోపలికి కొట్టుకుపోతున్న ఇద్దరు ఇటలీ దేశస్తులను లైఫ్‌గార్డులు, మెరైన్ సిబ్బంది కాపాడారు. ఎఎస్ఐ శ్రీనుబాబు, కానిస్టేబుల్ ఎ.అరుణేశ్వర రావు, హోంగార్డు సిహెచ్ అప్పారావు, లైఫ్ గార్డులు కె.వెంకటేష్, సిహెచ్.శ్రీను వారిని కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చారు.

ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : రేషన్‌కార్డుదారులకు ఈకెవైసి తప్పనిసరి అని సిఎస్ డిటి కె.శ్రీనివాసరావు తెలిపారు. భీమిలి మండలంలో 10,139, ఆనందపురం మండలంలో 5,571 మంది ఈకెవైసి చేయించుకోలేదని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి ఈకెవైసి చేయించు కోవాలని స్పష్టంచేశారు. ఈకెవైసి చేయించు కోని వారి జాబితాను రేషన్ డిపో డీలర్లకు, విఆర్‌ఒలకు పంపించినట్లు తెలిపారు.

పద్మనాభం : మండలంలో 4701 ఈకెవైసి పెండింగ్‌లో ఉన్నాయని సిఎస్ డిటి పి.మురళిబాబు శనివారం తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు ఈకెవైసి చేయించుకోవాలని తెలిపారు.

పలుచోట్ల జలదినోత్సవం

ఫామ్ పాండ్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రపంచ నీటి దినోత్సవాన్ని శనివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

పెందుర్తి : మండలంలోని ఎస్ఆర్.పురం గ్రామంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఫాం పాండ్‌కు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా భూగర్భ నీటి జలాలు పెంచేందుకు అనుకూలంగా ఫాం పాండ్‌లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకట్రావు, ఉపాధి హామీ ఎపిడి ఆంజనేయులు, ఎపిఒ గోవిందరావు, గ్రామ సర్పంచ్ దూది వెంకటరమణ, గోరపిల్లి సోమనాయుడు, అయిత ఎర్రి బాబు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి శ్రీవాణి మాట్లాడుతూ, నీరు లేకుంటే సమస్త జీవులు అంతరించిపోతాయని, జీవ వైవిధ్యం దెబ్బ తింటుందని వివరించారు. ఈ సందర్భంగా 'నీటి పరిరక్షణ, విద్యార్థుల బాధ్యత' అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్లేషియర్ పరిరక్షణపై పోటీలు

చోడవరం రూరల్ : ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని, విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ లక్ష్మీపురం జెడ్పి హైస్కూల్‌లో శనివారం గ్లేషియర్ పరిరక్షణపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అసోసియేట్ ఎం.సౌజన్య విద్యార్థులకు గ్లేషియర్ల పరిరక్షణ, నీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పోటీల్లో విజేతలకు హెచ్ఎం, పాఠశాల ఛైర్మన్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. సర్పంచ్ భవాని గణపతి సహకారం అందించారు.

పంట కుంటల ప్రారంభం

బుచ్చయ్యపేట : ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కొండెంపూడిలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నిర్మించిన పంట కుంటలను శనివారం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. అనంతరం కొబ్బరి మొక్కను ఎమ్మెల్యే నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నీటిని వృధా చేయరాదన్నారు. ప్రతి రైతు ఇల్లు మినీ వ్యవసాయ క్షేత్రం కావాలని, రైతులు పొలం గట్లను ఖాళీగా ఉంచరాదని, ఫల సాయం ఇచ్చే మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ డి.నాగేశ్వరి దేవి, ఎండిఓ విజయలక్ష్మి, టిడిపి నాయకులు కోటేశ్వరరావు, ఎంవివి.సత్యనారాయణ, దొండకర అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు, దొండా నరేష్, కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి

అనకాపల్లి -అచ్యుతాపురం నిర్వాసితుల సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-మునగపాక : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం అందజేయాలని కోరుతూ నిర్వాసిత సంఘం ఆధ్వర్యాన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిర్వాసితులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అనంతరం తహసిల్దార్ ఆదిమహేశ్వరరావుకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ అచ్చుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో పరిశ్రమలు ఏర్పడిన కారణంగా అభివృద్ధి దృష్ట్యా అనకాపల్లి, అచ్చుతాపురం ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా తమ భూములు, ఇల్లు కోల్పోతున్నామని తెలిపారు. అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని తాము తమ భూములను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నష్టపరిహారం వేస్తామని చెప్పి నేడు టిడిఆర్ బాండ్లు ఇచ్చి చేతులు దులుపుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. అధికారులు నేటి వరకు విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ఖచ్చితమైన పరిహారం ప్రకటించకపోగా టిడిఆర్ బాండ్లు ఇస్తాననటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విధంగా బాధితులను మభ్యపెట్టడం, వారి కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణమన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి తమ కుటుంబాలకు నగదు రూపంలో నష్టపరిహారం అందించే విధంగా ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు ఆడారి సత్యనారాయణ, ఏ శ్రీనివాస నాయుడు, పొలిమేర రాము, మావూరి సూరిబాబు, మల్ల గణేష్, కాంగ్రెస్ ధర్మ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసిత నాయకులు

ఆర్‌డిఒకు వినతి

అనకాపల్లి : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో ఇల్లు భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం ఇస్తామన్న నగదు తక్షణమే చెల్లించాలని, టిడిఆర్లు ఇచ్చి చేతులు దులుపుకుంటే ఊరుకునేది లేదని నిర్వాసితులు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆర్డిఓ షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేశారు. పాలకులకు అధికారులకు రోడ్డు విస్తరణపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు బ్రహ్మాజీ, బొడ్డేడ రామచంద్రరావు, సూరిశెట్టి రాజారావు, బొడ్డేడ రాము, శరగడం సూర్యనారాయణ, పెంటకోట శ్రీనివాస్, సూరిశెట్టి నాయుడు, శరగడం శ్రీనివాసరావు, బొడ్డేడ శ్రీను, శరగడం విష్ణు, గోవింద తదితరులు పాల్గొన్నారు.

31న రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్ అభివృద్ధితో పాటు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, అచ్చుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణ పనులను ఈనెల 31న మధ్యాహ్నం మూడు గంటలకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు అచ్చుతాపురం జంక్షన్‌లో శనివారం సాయంత్రం ఆర్ అండ్ బి ఈఈ ఆర్ఆర్.విద్యాసాగర్, డి ఈఈ పి.రాధాకృష్ణ, ఏఈఈ ఎస్ పద్మిని, సిఐ ఎన్ గణేష్, విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ నాయుడు తదితరులతో విస్తరణ పనులపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా విస్తరణ పనులకు సంబంధించిన పటాలను పరిశీలించారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి వేసే పిల్లర్స్ మెజర్మెంట్స్‌ను అధికారులతో అడిగి తెలుసుకుని సూచనలు చేశారు.

నేడు ఉచితంగా ఎముకల దృఢత్వ పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని నోబెల్ చారిటీస్, భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా ఎముకల దృఢత్వ పరీక్ష, ఎముకల వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు డాక్టర్ శరగడం నూకరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని గవరపాలెం సాయి నగర్‌లోని శిరిడి సాయిబాబా ఆలయం వద్ద ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగే ఈ ఎముకల వైద్య శిబిరంలో 3 వేల రూపాయల విలువచేసే ఎముకల దృఢత్వ పరీక్ష ఉచితంగా చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ గుండా సుధీర్ సేవలు అందిస్తారని, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. వివరాలకు డాక్టర్ ఎస్.నూకరాజు (92472 61517, 93984 19288) ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

దొంగతనాలు అరికట్టాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధి గంగునాయుడుపాలెం గ్రామంలో రాత్రుల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని గ్రామస్తులు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామంలో చెందిన కె.కృష్ణనాయుడు, సన్యాసమ్మ దంపతుల ఇంట్లో శుక్రవారం అర్థరాత్రి రెండు గంటల సమయంలో దొంగలు చోరీ చేశారని, ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు అపహరించారని తెలిపారు. మూడు వారాల క్రితం ఆరు నాటు కోడి పుంజులను అపహరించారని చెప్పారు. ఈ విషయాన్ని పోలీస్ శాఖ వారికి 100 కాల్ చేసి వివరించామని తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను పట్టుకోవాలని కోరారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : క్రికెట్ బెట్టింగ్‌లకు యువత బానిసలవుతున్నారని, అందువల్ల క్రికెట్ బెట్టింగ్‌కు అడ్డుకట్ట వేయాలని, బెట్టింగులను ప్రోత్సహిస్తున్న బుకీలపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డిఎస్‌పి శ్రావణికి శనివారం వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన డిఎస్‌పి క్రికెట్ బెట్టింగులపై పోలీసు నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు బొడ్డేడ అప్పారావు, డాక్టర్ చిన్ని యాదవ్, బొడ్డు సోమరాజు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే లక్ష్యంగా పి4 సర్వే

ప్రజాశక్తి-యలమంచిలి : పేద ప్రజల స్థితిగతులు తెలుసుకొని వారిని మరింత ఉన్నత స్థితికి తీసుకొచ్చే ఉద్దేశంతో పి4 నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు శనివారం ప్రకటించారు. పేదల్ని గుర్తించి వారికి సాంకేతికత జోడించి లక్షాధికారుల్ని చేయడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. ముందుగా వారి స్థితి గతుల్ని రికార్డు చేసి ప్రజల ముందుంచుతున్నామని చెప్పారు. అందులో తప్పొప్పుల్ని సరిదిద్దాల్సింగా ఆయన కోరారు. అనంతరం అభివృద్ధి కార్యాచరణ చేపడతామన్నారు. మున్సిపాలిటీల్లోని సచివాలయాల్లో కమిషనర్, మండలంలోని సచివాలయాల్లో ఎంపిడిఒ కొండలరావు, ప్రసాదరావు సమీక్షలు నిర్వహించి రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన విధి విధానాలు ప్రకటించారు.

నూకాంబిక జాతరకు సహకరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పండుగగా అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారి జాతరను ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సహాయ సహకారాలు అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు ఆలయ సహాయ కమిషనర్, ఈవో వెంపల రాంబాబు, పండగ ప్రత్యేక అధికారిణి కే. శోభారాణి కలిసి వినతి పత్రం అందజేశారు. అమ్మవారి జాతరకు, కొత్త అమావాస్యకు ఆలయానికి కార్పొరేషన్ ద్వారా పూర్తి సహాయ సహకారం అందించాలని కోరారు. దీనికి జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు.

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషాకు శనివారం అఖిలపక్ష నేతలు వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు మంచినీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకుగాను తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, కోరిబిల్లి శంకరరావు, కోన లక్ష్మణ్, విత్తనాల పోతురాజు, మత్తుర్తి సూరిబాబు పాల్గొన్నారు.

నాగులాపల్లి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : కార్మిక నేత, మాజీ సర్పంచ్ కీర్తిశేషులు నాగులాపల్లి సత్యనారాయణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని రాజాం గ్రామంలో ఏర్పాటు చేసిన నాగులాపల్లి సత్యనారాయణ విగ్రహాన్ని శనివారం సిపిఐయం జాతీయ అధ్యక్షుడు ఎన్ కనకరావు, కార్యదర్శి నీరజ్ చౌబే (పాట్నా), చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి దంతులూరి వర్మ ఆవిష్కరించారు. నాగులాపల్లి సత్యనారాయణ చేపట్టిన ప్రజా ఉద్యమాలు, కార్మిక పోరాటాల గురించి వక్తలు కొనియాడారు. నాగులాపల్లి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు కే.అచ్చంనాయుడు, కోవెల జనార్ధనరావు, జి కోటేశ్వరరావు, కోరుకొండ రవికుమార్, కార్మిక, ప్రజాసంఘాల ప్రతినిధులు ప్రతినిధులు పాల్గొని నాగులాపల్లికి నివాళులర్పించారు.

నాగులాపల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను యువత ఆదర్శంగా తీసుకోవాలి

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి

విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో అనకాపల్లిలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎం.నూకరాజు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయస్సులోనే ఉరి తాళ్లను ముద్దాడిన భారత దేశ ముద్దుబిడ్డలైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చెడు వ్యసనాలకు, సినిమాలకు, సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్నారని, వాటికి దూరంగా ఉంటూ దేశభక్తిని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, తరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లకు నివాళి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఇటీవల కాలంలో కుల రాజకీయాలు, మతోన్మాద విద్వేషాలు పెచ్చు మీరాయని, వీటిని ఎదిరించి లౌకిగా ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత నేటి యువత పై ఉందని డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి కె.సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రావణ్ పిలుపు ఇచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాలలో శనివారం వర్ధంతి సభలు నిర్వహించారు. జగదాంబ, మద్దిలపాలెం, ఆరిలోవ, కంచరపాలెం తదితర ప్రాంతాలలో జరిగిన యువకుల సమావేశాలలో వారు మాట్లాడుతూ, భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.సమాజంలో తాము ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను అధిగమిస్తూ పరులకు ఉపయోగపడేలా యువత జీవించాలన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు అనిల్, ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొని మాట్లాడారు.అధిక సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌కు నివాళులర్పిస్తున్న రాజు తదితరులు

ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గోర్లివానిపాలెం కాలనీలో తొలి తెలుగు చక్రవర్తి ప్రథమాంధ్ర మహా పాలకుడు శాలివాహన చక్రవర్తి 1947వ జయంతి వేడుకలు శనివారం కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం నాయకులు శాలివాహనుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు అనకాపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ అఖండ భారతదేశాన్ని ఏలిన తొలి తెలుగు చక్రవర్తి అని కొనియాడారు. ప్రజలకు సుపరిపాలన అందించిన గొప్ప పరిపాలనా దక్షుడన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనకాపల్లి అప్పారావు, సి.హెచ్ రామారావు, ఎ నాగమహేష్, ఏ దేముడు, ఎ హరి ప్రసాద్, ఎ.అబ్బాయి, ఎ రమణ తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కస్తూరా బాయి గాంధీ బాలికల విద్యాలయంలో 6, 11వ తరగతుల్లో ప్రవేశాలకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి శనివారం ఒక ప్రకటన తెలిపారు. మార్చి 22 నుండి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాధులు, బడి బయటపిల్లలు, బడి మానేసిన పిల్లలు, పేదవాళ్ళు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బిపిఎల్ కుటుంబాలకు చెందిన బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని మరింత సమాచారం కోసం కెజీబీవీ స్కూల్ నోటీస్ బోర్డుపై చూడవచ్చని చెప్పారు. సమాచారం కోసం 7075159996. 707503990 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) వాహనంలో పనిచేస్తున్న కెప్టెన్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి సిఐటియు జిల్లాలో జరిగిన సంఘం జిల్లా సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.దేవి ప్రసాద్ మాట్లాడారు. 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న కెప్టెన్స్‌కి గత తొమ్మిది సంవత్సరాలుగా అతి తక్కువ వేతనం రూ.7,870 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా ఆసుపత్రులకు, గమ్యస్థానాలకు చేర్చుతున్నట్లు చెప్పారు. అత్యంత నైపుణ్యం, విద్యార్హతలు కలిగి పనిచేస్తున్న తమకు కనీస వేతనం లేకపోవడంతో దుర్భరమైన పరిస్థితులతో జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు, విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగాయని, అయినా 9 ఏళ్ల నుండి జీతం పెంచకపోవడం అన్యాయమన్నారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం అమలు పట్ల కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మార్చి 31వ తేదీతో కాంట్రాక్ట్ ముగిసిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం, యాజమాన్యం ఆలోచించి తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న వారికి నెల జీతం రూ.18,500కు పెంచాలని, సెల్ ఫోను, గ్రూప్, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి కష్ణ, డి శ్రీనివాసరావు, ఏ.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల పత్రాన్ని చూపుతున్న నాయకులు

మాట్లాడుతున్న ఎస్ఐ సావిత్రి

బాలికలు కరాటే నేర్చుకోవాలి

ప్రజాశక్తి-యలమంచిలి : మనం మనల్ని రక్షించుకొనేందుకు బాలికలు నేర్చుకోవాలని కరాటే బ్లాక్‌బెల్టు గ్రహీత నక్కా వెంకటరామన్ సూచించారు. స్టేషన్ రోడ్డులోని జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థినులకు శనివారం సెల్ఫ్ ప్రొటెక్షన్ టిక్నిక్స్ వివరించారు. టౌన్ ఎస్ఐ సావిత్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని కరాటే వంటి పోరాట విద్యలు నేర్చుకోవాలని సూచించారు. పెరుగుతున్న వయసులో ఎదురౌతున్న లైంగిక వేధింపులను లైట్‌గా తీసుకోవద్దని హెచ్చరించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో పెరిగిపోతున్న రద్దీ ప్రాంతాల్లో విద్యార్థులకు ఎదరౌతున్న లైంగిక సమస్యల పట్ల ధైర్యంగా ముందుకొచ్చి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ సావిత్రి, కానిస్టేబుల్ ఏళ్ల రావు, ఆర్ సునీత, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టసభల్లో రెల్లిలకు 2శాతం సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : చట్ట సభల్లో రెల్లి కులస్తులకు 2 శాతం సీట్లు కేటాయించాలని రాష్ట్ర రెల్లి నాయకులు కోన అప్పారావు డిమాండ్ చేశారు. తుమ్మపాల ఇందిరానగర్ రెల్లి కులస్తులు శనివారం కోన దుర్గేశ్వరరావు (దుర్గ) అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం ఏపిలో రెల్లి కులస్తులు 1,35,000 జనాభాపై చిలుకు ఉన్నారని, చట్టసభల్లో ఒక పర్సెంటు ఇవ్వడం అన్యాయమని, దీనిని రెండు శాతానికి పెంచాలని కోరారు. కార్యక్రమంలో కుల పెద్దలు కోన గాంధీ, బుద్ధ రమణ, ముత్యాల అప్పారావు, ముత్యాల రామకృష్ణ, పొట్నూరు గోవిందరావు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలని వినతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం-2 వీఆర్ఏగా విధి నిర్వహణలో ఉన్న తనపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని విఆర్ఏ ముదపాక అప్పారావు స్థానిక తహసీల్దార్ బి. చిన్నికృష్ణకు శనివారం ఫిర్యాదు చేశారు. సబ్బవరం సర్వే నంబర్ 255, 271లలో ప్రభుత్వ గెడ్డవాగు పోరంబోకు భూములను కొంతమంది దురాక్రమణ చేసి నిర్మాణాలు చేశారని తెలిపారు. తాను, స్థానిక ఆర్ఐ వీరయ్య, విఆర్వోలతో విధి నిర్వహణలో భాగంగా ఆక్రమణలను తొలగించే పనిలో ఉండగా, తనపై వ్యక్తిగతంగా దుర్భషలాడి, కులం పేరుతో దూషించి దాడి చేసి కొట్టారని అప్పారావు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, ల్యాండ్ గ్రాబింగ్ కేసు, క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని ఎం.జగన్నాథపురం గ్రామంలో శనివారం చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. వ్యాపార కేంద్రాల వద్ద డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగించాలని సూచించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ కింద పనులను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ కొరెడ్డ బుల్లెమ్మ, ఎంపీడీవో ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

చెత్త డబ్బాలు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

విద్యుత్ ఫిర్యాదుల పరిష్కారానికి కాలపరిమితి

సిజిఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

మాట్లాడుతున్న సిజిఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యుత్ ఫిర్యాదులు కాలపరిమితిలోగా పరిష్కారం కాకపోతే వినియోగదారులకు విద్యుత్ శాఖ పరిహారం చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ బి.సత్యనారాయణ స్పష్టం చేశారు. శ్రీగౌరీ గ్రంథాలయంలో నెహ్రూ యువ కేంద్రం, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్, మండల వినియోగదారుల మండలి సహకారంతో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక -ప్రయోజనాలు' అనే అంశంపై శనివారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యుత్ సేవల సిటిజన్ ఛార్టర్‌ను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి సేవా లోపం ఉన్నా సీజీఆర్ఎఫ్‌కు వ్యక్తిగతంగా, వాట్సాప్ నెంబర్ 94936 81912కు, chrper@apeasternpower.comకు ఈ మెయిల్, పోస్టు ద్వారా లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. విద్యుత్ సమస్యలున్న వినియోగదారులు www.apspdcl.in/CGRF1/వెబ్‌సైట్‌ను సందర్శించి అవగాహన పెంచుకోవాలన్నారు. ఫిర్యాదు చేయడానికి ఎటువంటి రుసుం లేదని, న్యాయవాది అక్కరలేదన్నారు. సమస్య ఉత్పన్నమైన నాటి నుంచి రెండేళ్లలోపు నిర్దేశిత దరఖాస్తులో రాతపూర్వకంగా సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేయవచ్చని, 60 రోజుల్లోపు తీర్పు వెలువడుతుందని తెలిపారు. దీనికి ముందు 1912కు, క్షేత్ర స్థాయి విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసి తిరుగు రశీదులు పొందాలని సూచించారు. సదస్సులో స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి ఇరువర్గాలను విచారిస్తామని చెప్పారు. ఏపి ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ గొర్లి మహేశ్వరరావు, సీజీఆర్ఎఫ్ సభ్యులు షైక్ బాబర్, వి.మురళీకృష్ణ, సమాచార హక్కు ఉద్యమకర్తలు కె.శ్రీరామకిషోర్, ఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.వి.రామరెడ్డి, గౌరీ గ్రంథాలయ అధ్యక్షులు డి.నూకఅప్పారావు, పి.శివశంకర్, శరడగం శ్రీనువాసరావు, కాండ్రేగుల సత్యనారాయణ (ఎఫ్ఎఫ్ఐ) తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల వెల్లువ

వ్యక్తిగత విద్యుత్ కనక్షన్లు, బహుళ అంతస్తుల్లోని ప్యానల్ బోర్డుల ఏర్పాటు, కొత్త విద్యుత్ సర్వీస్ కనక్షన్ల దరఖాస్తులను కారణాలను తెలియజేయకుండా తిరస్కరించడం, విద్యుత్ బిల్లింగ్‌లో లోపాలు, కేటగిరీ మార్పు, సరఫరా పునరుద్ధరణ, కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీలో జాప్యం, విద్యుత్ ఓల్టేజీ హెచ్చుతగ్గులు, మీటర్ల, సేవల్లో లోపాలు తదితర విద్యుత్ సమస్యలపై లిఖితపూర్వక విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదులు చేశారు.

స్పాట్ వాల్యుయేషన్‌కు తగిన వసతులు కల్పించాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

స్పాట్ వాల్యుయేషన్‌కు తగిన వసతులు కల్పించాలని డిఈఓ గిడ్డి అప్పారావు నాయుడుకు యుటిఎఫ్ నాయకులు శనివారం స్థానిక అంబేద్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ పదో తరగతి బోధించడంలో మూడు సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం కలిగి, పదవ తరగతి పరీక్ష మూల్యాంకనానికి సమ్మతి తెలిపే ఉపాధ్యాయులను స్పాట్ వాల్యుయేషన్‌లో నియమించాలని కోరారు. స్పాట్ వాల్యుయేషన్‌కు ఆయా సబ్జెక్టులలో ఎంతమంది ఉపాధ్యాయులు అవసరమవుతారో, ఆ సీనియార్టీ లిస్టులను ముందుగా తెలియజేయాలని సూచించారు. స్పాట్ వ్యాల్యూయేషన్ సెంటర్లలో గాలి, వెలుతురు, వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని రెండు పూటలా మజ్జిగ, చల్లని నీరు సమకూర్చాలని కోరారు. 58 సంవత్సరాలు పైబడిన వయస్సు వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, స్పాండిలైటిస్, వెన్నెముక సంబంధిత వ్యాధులు ఉన్న టీచర్లకు, 50శాతం అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులు, పాలిచ్చు తల్లులు, గర్భిణులు వంటి వారికి వారు కోరుకుంటే స్పాట్ వేల్యూషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి నాతవరపు సతీష్, ఆశ, రవి, కరుణ జ్యోతి పాల్గొన్నారు.

త్యాగాల ఫలితమే ఎస్‌సిల వర్గీకరణ

ప్రజాశక్తి-వడ్డాది : అమరవీరుల త్యాగ ఫలితమే ఎస్సీలు వర్గీకరణ అని అనకాపల్లి జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మూర్ల శ్రీనివాసరావు అన్నారు. బుచ్చయ్యపేట మండలం విజయరామరాజు పేటలో శనివారం ఎమ్మార్పీస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీల ఉమ్మడి ఏబిసిడి వర్గీకరణ కోసం వర్గీకరణ పోరాటంలో ఉద్యమంలో అమరులైన త్యాగాలకు వారి కుటుంబాలకు అంకితమని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బెన్నావోలు నారాయణమూర్తి, పెడమట్ల నాగమ్మ పాల్గొన్నారు.

ఇస్రోను సందర్శించిన డైట్ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (ఇస్రో)ను సందర్శించే అరుదైన అవకాశం లభించింది. ఈ సందర్శన ద్వారా రాకెట్ లాంచ్ ప్యాడ్లు, కంట్రోల్ రూమ్ కార్యకలాపాలు, ఉపగ్రహ ప్రక్షేపణ విధానాలు వంటి కీలక అంశాలపై ప్రత్యక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ఇస్రో శాస్త్రవేత్త రామాంజనేయులు అంతరిక్ష ప్రయోగ కేంద్రం, ఉపగ్రహ ప్రక్షేపణాల తీరుతెన్నులపై విలువైన సమాచారం అందించారు. ఈ సందర్భంగా శనివారం ఇస్రోను సందర్శించిన విద్యార్థులతో డైట్ చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడారు. ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవడానికి, అత్యాధునిక సాంకేతికతలను అర్థం చేసుకునేందుకు ఇలాంటి సందర్శనలు ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. వైకుంఠరావు, సిఎస్ఈ విభాగ అధిపతి కె. సుజాత పాల్గొన్నారు.

ముగిసిన అంగన్వాడీల శిక్షణ

ప్రజాశక్తి-కె.కోటపాడు

పోషణ్ భీ పడాయి భీ పై అంగన్వాడీ కార్యకర్తలకు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో జరుగుతున్న మూడు రోజుల శిక్షణా తరగతులు శనివారం ముగిసాయి. అప్పుడే పుట్టిన పిల్లల నుండి మూడేళ్ల లోపు పిల్లలకు, 3-6 ఏళ్ల లోపు పిల్లలకు పెంపకం, చదువులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ వి మంగతాయారు, సూపర్వైజర్లు ఎల్‌బి సుశీల, జి.ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట : ఆట పాటలు ద్వారా పిల్లలను ఆకట్టుకోవాలని సిడిపిఓ ప్రభావతి అన్నారు. అనకాపల్లి, కశింకోట మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు బయ్యవరం హైస్కూల్‌లో శనివారం శిక్షణ జరిగింది. కార్యక్రమంలో శశికళ, సూపర్ వైజర్లు రూన్సీరాణి, వంశీ ప్రియా, జికే. లక్ష్మి, జి.వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు పోషణ్ భీ పడాయి భీ అనే కార్యక్రమంలో భాగంగా మూడవరోజు శిక్షణ ఇచ్చారు. పోషకాహారం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సత్యవతి, నిషా పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం వెలుగు కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంగన్‌వాడీ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, ఉమాజానకి మాట్లాడుతూ, చిన్నారులకు సులువైన పద్ధతిలో, ఆటపాటలతో విద్యాబోధన చేసే విధంగా ఈ శిక్షణ అందించినట్లు చెప్పారు. పిల్లల పోషణ, ఆరోగ్య పరిస్థితులు, గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలపైన చిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు.

కశింకోటలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

బల్క్ డ్రగ్ పార్క్‌కు భూములివ్వం

గ్రామసభలో తేల్చి చెప్పిన జానకయ్యపేట రైతులు

ప్రజాశక్తి -నక్కపల్లి:బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు భూములు ఇచ్చేది లేదని, ఇప్పటికే హెటిరో డ్రగ్స్ కాలుష్యంతో అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని జానకయ్యపేట గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు ముక్తకంఠంతో అధికారులకు తేల్చి చెప్పారు. మండలంలోని జానకయ్యపేట గ్రామంలో తహసిల్దార్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎస్‌డిసి అనిత శనివారం రెండవ ఫేజ్ భూసేకరణకు గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌డిసి అనిత మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపన కోసం భూసేకరణ చేపడుతున్నామని, రైతులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. జానకయ్యపేటలో సుమారుగా 200 ఎకరాల వరకు జిరాయితి భూమి సేకరించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గ్రామానికి చెందిన రైతులు గ్రామస్తులు భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకించారు. పూర్వం నుండి పాడి పంట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, భూములు తీసుకుంటే తమ జీవనం ఎలా అని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే హెట్రో డ్రగ్స్ కంపెనీ కాలుష్యం కారణంగా గ్రామంలో అనేకమంది రోగాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాన్సర్, కీళ్ల నొప్పులు, అనేక రకాల అనారోగ్య సమస్యలతో చాలామంది సతమతమవుతున్నారన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే మరింత సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. భూ సేకరణకు చేపడుతున్న సర్వేను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ డి సి అనితకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు కురుందాసు నూకరాజు, కురుందాసు సింహాచలం, గ్రామస్తులు కురందాసు అప్పలరాజు, దేవర సత్తిబాబు, కురుందాసు నానాజీ , కృష్ణారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న రైతులు

నూకాలమ్మ ఉత్సవ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో శ్రీనూకాలమ్మ తల్లి పండుగ మహోత్సవాలను పురస్కరించుకొని కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కొరుప్రోలు శ్రీను, సభ్యులుగా దాడి శ్రీను, దాబా శ్రీను, ఎం. అప్పలరాజు, సబ్బవరపు వెంకట సత్యనాగేశ్వరరావు, తాత నాయుడు, రుత్తల చిన్న, గాలి రమణ, కొత్తల రామకృష్ణ, ఇసంశెట్టి మల్లి, ఋషి కుమార్, పప్పల నాయుడు, కోనేటి ఈశ్వరరావు, శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, ఈనెల 22న శనివారం రాత్రి 7 గంటల నుంచి తీన్మార్, తప్పిడిగుళ్ళు, కోలాటం, సినీ కోలాటాలతో మొదటి జాగారం ప్రారంభమవు తుందన్నారు. 24న సోమవారం రాత్రి 7 గంటల నుంచి కాంగో, కోలాటం, డప్పులతో రెండవ జాగారం, 27న గురువారం రాత్రి 8 గంటల నుండి తీన్మార్, కాంగో, తప్పెడు గుళ్ళు, ఏలూరు వారిచే అఘోర్ డాన్స్‌తో పెద్ద జాగారం నిర్వహిస్తారన్నారు. డ్యాన్స్ బేబి డ్యాన్స్ ప్రదర్శన, బుర్రకథ ఏర్పాటు చేస్తామన్నారు. 28న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుండి కాంతార, గోపాల గోపాల, లేడి తాలమార, గోపాల, చిడతలు డ్యాన్సులతో ఊరేగింపు జరగనుందన్నారు. రాత్రి 7 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో బాలూ రైడర్స్, మెగా డ్యాన్స్ హంగామా నిర్వహించనున్నామని తెలిపారు.

నూతన కమిటీ సభ్యులు

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో భక్తులు పోటెత్తారు. శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -రావికమతం: మండల కేంద్రంలో పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ముమ్మరంగా చేపట్టారు.గ్రామంలో పలు వీధుల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్‌తో డబ్బింగ్ యార్డ్ కి తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ, చెత్తాచెదారాన్ని గ్రామస్తులు ఎక్కడపడితే అక్కడ వేయకూడదని సూచించార.చెత్త బండిలో మాత్రమే వేయాలని ఆయన సూచించారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు గణితం టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పెదబోధిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్ కమల్ ఫౌండేషన్ అండ్ వింగ్స్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థుల కు శనివారం గణితం టాలెంట్ టెస్టు నిర్వహించినట్లు హెచ్ఎమ్. చోడిశెట్టి సత్యనారాయణ తెలిపారు. 30 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పరీక్షలు రాసారన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎమ్.ఆనంద్, కార్యదర్శి జయప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో గణితం పట్ల ఆసక్తి, నైపుణ్యత పెంపొందించేందుకు గాను ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 30న విజేతలకు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఇప్పటికే ఫౌండేషన్ తరపున పలు సేవా కార్యక్రమంలో చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పి.రమేష్, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్. ఆచార్యులు,ఎ.వి.ఎల్.ఎన్.కుమారి, ఎస్.ఫాల్గుణ రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:అన్ని తరగతుల విద్యార్థుల పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు సూచించారు. మండలంలోని పెదబోదుగల్లం, నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన ఎంఈఓ కే నరేష్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసారు. త్వరలో జరగనున్న సమ్మేటివ్ 2 పరీక్షలు అన్ని తరగతుల విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించేలా ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలన్నారు. త్వరలో నిర్వహించనున్న తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియ పరచాలన్నారు. ఏయే తరగతులలో వెనుకబడిన విద్యార్థులు ఎంతమంది ఉన్నారో వారి పట్ల ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎమ్.చోడిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎన్.వి ఎస్.ఆచార్యులు, ఎస్.ఫాల్గుణ రావు, ఎ.వి.ఎల్.ఎన్. కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నలు అడుగుతున్న ఉప విద్యాశాఖాధికారి

తాగునీటి బోర్లు ఏర్పాటు

పనులు ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఐతంపూడిలో స్థానిక సర్పంచ్ పెద్దాడ నాయుడు, గ్రామ పెద్దలు కోరిక మేరకు నాలుగు తాగునీటి బోర్లు ఏర్పాటు చేశారు. బోర్ల నిర్మాణ పనులను జెడ్‌పిటిసి దొండా రాంబాబు శనివారం ప్రారంభించారు. పాడి రైతుల కోసం కల్లాల దగ్గర ఒక బోరు, గ్రామంలో ఇళ్ల దగ్గర 2, మరిడి తల్లి ఆలయం దగ్గర మరో బోరు ఏర్పాటు చేశారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా జడ్పిటిసి గ్రాండ్స్ నుండి అధికంగా తాగునీటి బోర్లకు నిధులు మంజూరు చేస్తున్నట్లు జెడ్‌పిటిసి రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు పెద్దాడ నాయుడు, గోపిశెట్టి శ్రీనివాస్, పి.రామనాయుడు, పొట్టిదొరపాలెం ఉపసర్పంచ్ గుద్దేటి శ్రీను పాల్గొన్నారు.

చీడికాడ:చీడికాడ గ్రామంలో జడ్పిటిసి నిధులతో తెలకల వారి కళ్ళంలో ఇండస్ అమ్మ గుడి, కొల్లివారు కొలుపూరి వారి కల్లాల వద్ద సుమారు రెండు లక్షల విలువైన బోర్లను చీడికాడ గ్రామ శాఖ అధ్యక్షులు పరవాడ మహేష్, జడ్పిటిసి శారదా జానకిరామ్, మండల పార్టీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, మండల పార్టీ పరిషత్ అధ్యక్షులు కురచా జయమ్మ నారాయణమూర్తిలు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు పరవాడ అప్పారావు, బూడి యువసేన సభ్యులు నాయుడు, శిరసాల మహేష్ ,కరగాన వెంకట శివ కుమార్, సిరికి బలరాం, మణిదీప్, బత్తిని ఎర్రన్న పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధించాలని నోటీసులు

ప్రజాశక్తి - చీడికాడ:ప్లాస్టిక్ వినియోగం నిలిపి వేయాలని మండల కేంద్రంలో కిరాణా, హొటల్ దుకాణదారులకు నోటీసులు పంచాయతీ కార్యదర్శి ఏ.సన్యాసిరావు అందజేశారు. పాలిథిన్ ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, స్పూన్లు, బ్యాగులు వినియోగించరాదని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ షాపులలో అమ్మకాలు చేయరాదని కోరారు. నింబంధనలు ధిక్కరిస్తే వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు

నోటీస్ ఇస్తున్న కార్యదర్శి

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - చీడికాడ : కస్తూరిబా గురుకుల బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని మండలంలోరి జి.కొత్తపల్లి కెజిబివి ప్రిన్సిపల్ భారతి ప్రకటన లో తెలిపారు కెజిబివిలో 6 వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ చేరేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ, బి.పి. ఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కి పరిగణింపబడతాయని ఆమె అన్నారు.ఎంపికైన విద్యార్థులకు ఫోన్, మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు.

పరిశీలిస్తున్న ఎంపిడిఒ సీతారామరాజు

ఫారం పాండ్‌లతో రైతులకు ఉపయోగం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని దోసలపాడు గ్రామంలో శనివారం ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు భూముల్లో చేపడుతున్న ఫారం పాండ్‌ను ఎంపీడీవో డి. సీతారామరాజు పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫారం పాండ్‌లతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫారం పాండ్ పై రైతులకు అవగాహన కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. అనంతరం చీడిక గ్రామంలో జరుగుతున్న పి- 4 సర్వే గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రెల్లిలకు న్యాయం చేయాలి

పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు న్యాయం చేయాలని శనివారం నర్సీపట్నంలో రెల్లిలు భారీ ర్యాలీ నిర్వహించారు. సిబిఎం కాంపౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీకన్య జంక్షన్ వరకు సాగింది. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు మాట్లాడుతూ. రెల్లీలకు రావలసిన వాటా పెంపు కోసం న్యాయం పోరాటం ద్వారానే సాధ్యమన్నారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లిలకు అన్యాయంపై పునరాలోచన చేయాలన్నారు. రెల్లీలకు 1శాతం కేటాయించి అన్యాయం చేశారన్నారు. గతంలో ఏబీసీడీ వర్గీకరణలో రెల్లిలకు 1శాతం రిజర్వేషన్ మహిళలకు కేటాయించి మగ వారికి ఎటువంటి అవకాశాలు దక్కకుండా చేసి అన్యాయం చేశారన్నారు. రిజర్వేషన్ శాతం 1 శాతం 5కు పెంచాలని కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు రెల్లిలు నానాటికి విద్య ఉపాధి, ఉద్యోగ, సంక్షేమలో వెనుకబడి ఉన్నారన్నారు. ఇప్పటికైనా 5శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బంగారి వెంకటేశ్వరరావు, బంగారి సూరిబాబు, అప్పన్నబాబు, లోవరాజు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:రెల్లి కులానికి రాష్ట్ర ప్రభుత్వం 1శాతం రిజర్వేషన్ ప్రకటించడం తీవ్ర అన్యాయమని గొలుగొండ గ్రామ రెల్లి కులస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం గ్రామంలో నిరసన చేపట్టారు. 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దశలవారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెల్లి ప్రతినిధులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో నిరసన చేపడుతున్న రెల్లిలు

జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు చైత్రదీపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:తైవాన్‌లో ఈనెల 24వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరగనున్న ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ కాంపిటిషన్స్‌లో నర్సీపట్నంకు చెందిన పి.చైత్రదీపిక భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ పోటీలలో పలు విభాగాల్లో పాల్గొనబోతున్న చైత్ర దీపిక తన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠనూ, కీర్తినీ సంపాదించేందుకు సిద్ధమవుతోంది. గతంలో 59, 60, 61, 62 నేషనల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లతో పాటు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయి ఆర్టిస్టిక్ పోటీల్లో పాల్గొని ఇప్పటి వరకు 44 పతకాలను కైవసం చేసుకుంది. ఆమె సాధించిన విజయాలు క్రీడా ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. 2023లో చైనాలో జరిగిన 19వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి, పెయిర్ స్కేటింగ్‌లో ఆరు దేశాలతో పోటీ చేసి బంగారు పతకాన్ని సాధించింది. ఈ అద్భుత విజయంతో దేశానికి గర్వకారణంగా నిలిచిన చైత్రదీపిక తాజాగా ప్రతిభ ఆధారంగా మరోసారి భారత జట్టుకు ఎంపికైంది. టీమ్ ఇండియన్ రోలర్ స్కేటింగ్ కోచ్ పంచాడ సత్యానారాయణ వద్ద శిక్షణతో ఈసారి కూడా తైవాన్ ఛాంపియన్షిప్‌లో భారతదేశానికి ఎక్కువ పతకాలు సాధించి దేశానికే కాకుండా రాష్ట్రానికి, జిల్లాకు క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడా అభిమానులు, కుటుంబ సభ్యులు, ప్రవాస ఆంధ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌టిసిలో ఏడుగురికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:ఎపిఎస్ ఆర్టీసిలో పని చేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు వివిధ గవర్నమెంట్ శాఖలలో ఏడుగురికి కారుణ్య నియామకాల ద్వారా అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఇచ్చారు. చాలా రోజుల నుండి ఈ అప్లికేషన్స్ పెండింగ్ లో ఉండగా ఎపిఎస్ఆర్టీసి యాజమాన్యం, ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్‌కి సమర్పించిన విజ్ఞాపన పత్రాల పరిశీలనా అనంతరం ఆదేశాల ప్రకారం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో ఏడుగురికి శనివారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎపిఎస్ఆర్టీసి విశాఖపట్నం రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డి.ఆర్.ఓ బి.హెచ్, భవాని శంకర్, ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్, జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి. శ్రీధర్ పాల్గొన్నారు.

నైపుణ్య విద్యతో మెరుగైన ఉద్యోగావకాశాలు
- ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:ప్రస్తుత తరంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన విద్య నేర్చుకున్న వారికి మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ అన్నారు. బోయింగ్ ఇండియా లెర్నింగ్ లింక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వేదికగా ఏరోస్పేస్ రంగంలో నిర్వహించిన ఆరు నెలల పారిశ్రామిక శిక్షణ పూర్తి చేసుకున్న మూడవ బ్యాచ్ విద్యార్థులకు శనివారం ఉదయం శిక్షణా సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతికంగా ఎదగాలంటే కేవలం ఇంజనీరింగ్ విద్య అభ్యసించడం మాత్రమే భవిష్యత్తుకు మార్గదర్శకత్వం కాదని, ప్రస్తుత సమాజంలో విద్యార్థులు, యువత భాష మీద పట్టు, మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలన్నారు. వీటితోపాటు సాంకేతిక నైపుణ్యంలో మెలుకువలు నేర్చుకున్న వారికి భవిష్యత్తులో మరిన్ని మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. అనంతరం ఏరోస్పేస్ తయారీ శిక్షణ పొందిన 127 మంది విద్యార్థులకు ఆయన గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందించారు.ఈ కార్యక్రమంలో బోయింగ్ ఇండియా సౌత్ ఆసియా చీఫ్ ఆఫ్ స్టాఫ్ సీఎస్ఆర్ లీడర్ ప్రవీణ యజ్ఞంభట్, సౌత్ ఏషియా ప్రెసిడెంట్ సలీల్ గుప్తే, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు నురియా అన్సారీ, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుధా ప్రియదర్శన్ విద్యాశాఖ శిక్షణా ప్లేస్మెంట్ డైరెక్టర్ రామకృష్ణారావు, ఫ్లూయట్ గ్రిడ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఐఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

పరిశ్రమల కాలుష్యం నుండి రక్షించాలి

సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో సమస్యల వెల్లువ

రసాయన వ్యర్థ జలాలను పరిశీలిస్తున్న లోకనాథం

ప్రజాశక్తి-రాంబిల్లి

ఎస్ఈజెడ్‌లోని పరిశ్రమల నుంచి విడుదలయ్యే రసాయన వ్యర్థ జలాలు, కాలుష్యం నుండి పరిసర గ్రామాలను కాపాడాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని లోవ-పాలెం, తోటవీధి, లాలంకోడూరు శివారు ఎరకన్న గారి ఇల్లు, సీతపాలెం గ్రామాల్లో శనివారం సిపిఎం నేతలతో కలిసి ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా పంట కాలువుల్లోకి వదిలేస్తున్నారని, పంటలు నాశనమవుతున్నాయని, భూగర్భ జలాలు కలుషితమై తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతంలో అణు విద్యుత్ ప్లాంట్ నెలకొల్పుతామని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు, నాయకులు ఎన్.నారాయణరావు, సిహెచ్.రామకృష్ణ, ధోని కాసియా, వై.రాము, సిహెచ్ ఇల్లనాయుడు, సిహెచ్ చిట్టిబాబు, దావీద్ పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని కలపాక పంచాయతీ పరిధి మూల స్వయంవరం గ్రామాన్ని వెంటనే సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన గ్రామంలో పర్యటించారు. మహిళలు, వృద్ధులు ఎన్టిపిసి కాలుష్యం వలన పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ గ్రామ ప్రజలు కిడ్నీ, చర్మ సంబంధిత, కంటి, ఊపిరితిత్తులు, గుండె, క్యాన్సర్ వంటి వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తరలించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీను, ఆదిలక్ష్మి, పార్వతమ్మ, పద్మ, అప్పల నరసమ్మ, గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

అచ్యుతాపురం : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం నాయకులు శనివారం దిబ్బపాలెం పునరావాస కాలనీలో పర్యటించారు. నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రావిపాలెంలో భూములన్ని సేకరించారని, నేటి వరకు పరిహారం చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అర్.శంకర్రావు, మండల కన్వీనర్ రొంగలి రాము, నాయకులు కూండ్రపు సోమునాయుడు, శ్రీను, సూర్యకళ, ఎల్ సురేష్, అర్ శ్రీను పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి

పరవాడలో సమస్యలు తెలుసుకుంటున్న కోటేశ్వరరావు

కె.కోటపాడు : మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీ సిపిఎం నాయకులు శనివారం పర్యటించారు. తమ కాలనీలో పారిశుధ్యం లోపించిందని సిపిఎం నాయకుల వద్ద స్థానికులు వాపోయారు. కాలనీలో ఉన్న కాలువకు ఇరువైపులా చెత్తాచెదారంతో నిండి ఉండడం వలన కాలువలో మురికి నీరు ప్రవహించడం లేదని, దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గండి నాయినబాబు, ఎర్ర దేవుడు, వనము సూర్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

సబ్బవరం : మండలంలోని ఉపాధి హామీ కూలీలకు వేసవి అలవెన్స్, వేతన బకాయిలు చెల్లించాలని సిపిఎం మండల నాయకులు ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేసారు. మండలంలోని చిన బంగారమ్మపాలెం గ్రామంలో శనివారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.కోటి, ఎర్రయ్య, శంకర్, దాలినాయుడు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి అన్యాయంగా పెంచిన ఇంటి పన్నులు, వాటర్ పన్నులను తక్షణం రద్దు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం ఉదయం ఆయన జివిఎంసి 18వ వార్డు పరిధి అంజయ్యనగర్ కాలనీలో పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లుల భారాలను ఆయన దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. అనంతరం జగ్గునాయుడు మాట్లాడుతూ అంజయ్యనగర్ ప్రాంతంలో ప్రభుత్వ స్కీం ఇళ్లకు గతంలో ఏడాదికి రూ.250 పన్ను ఉండేదని, ఇప్పుడది ఒక్కో ఇంటికి మూడు వేల నుంచి ఐదు వేలు వరకూ చేరిందని తెలిపారు. మురికివాడ ప్రాంతమైన అంజయ్యనగర్‌పై జివిఎంసి అధికారులు ఏకపక్ష నిర్ణయంతో ఇంటి పన్నులు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాలనీకి ఆనుకుని ఉన్న గెడ్డలోకి ఆరిలోవ ప్రాంతంలోని హాస్పిటల్స్ నిర్వాహకులు, అపార్ట్‌మెంట్ వాసులు, వెంకోజీపాలెం మెడికవర్ హాస్పిటల్ వ్యర్థాలను విడిచిపెడుతుండటంతో ప్రజలు దుర్వాసనను భరించలేకపోతున్నారని తెలిపారు. తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. విద్యుత్ బిల్లులు గతం కంటే 200 రెట్లు పెరిగాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు జె.కోదండ, పివి.రమణ, ఎన్‌వి.రమణ, ఎం.చంటి, రాజేష్, సంతోష్, యుఎస్ఎన్.రాజు, కుమారి, ప్రియాంక, వెంకటరావు, చలపతి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణా మార్కెట్, కల్లు పాకలు ప్రాంతంలో ప్రజా సమస్యలపై సర్వే చేపట్టారు. పార్టీ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ కల్లుపాకలు ప్రాంతంలో 80 నుంచి 90 శాతం మందికి సొంత ఇళ్లు లేవన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రి చంద్రశేఖర్, కె.సంతోష్ కుమార్ పాల్గొన్నారు. పార్టీ నాయకులు వై.రాజు నేతృత్వాన గంగులు గెడ్డ ప్రాంతంలో సర్వే నిర్వహించారు. అక్కడ రజక వృత్తి చేసుకుంటున్న పలు కుటుంబాల వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల గోడు విన్నారు. తమ ప్రాంతంలో 32 ఇళ్లు ఉన్నాయని, అందులో అందరూ రజకులని, 20 గజాలు కూడా లేని స్కీము ఇళ్లను నాడు ఇచ్చారని, వాటికి హౌస్ ట్యాక్స్ ప్రస్తుతం రూ.3 వేలు వస్తోందని నివాసితులు వాపోయారు. కార్యక్రమంలో కె.నర్సింగరావు, కెవిపి చంద్రమౌళి, బొట్టా రామకృష్ణ పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో లోకనాథం, జగ్గునాయుడు

గాజువాక : గాజువాక పరిధి దుర్గానగర్ కాలనీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు ఇంటింటికీ వెళ్లి సమస్యలపై సర్వే చేశారు. సిపిఎం నాయకుల దృష్టికి స్థానికులు పలు

సమస్యలు తెలుసుకుంటున్న జగ్గునాయుడు

సమస్యలను తీసుకొచ్చారు. రెండు నెలలుగా కరెంటు చార్జీలు విపరీతంగా వస్తున్నాయని, ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్నప్పటికీ పట్టాలు లేవని, హౌస్ టాక్స్‌లు ఎక్కువగా వస్తున్నాయని, సరైన కాలువ లేకపోవడం వల్ల మురుగు నీరు ఇళ్లల్లోకి చేరుతుందని, వీధిలైట్లు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఇమ్మానుయేల్, కృష్ణ పాల్గొన్నారు.

జోగవానిపాలెం, పెంటయ్యనగర్‌లో...

జోగవానిపాలెం, పెంటయ్యనగర్, రైతుబజార్, బానోజికొండ ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యాన సర్వేలు చేశారు. ఎన్నో సంవత్సరాల నుంచి నివసిస్తున్నా పట్టాలు లేవని, డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని పెంటయ్యనగర్ ప్రజలు, బానోజీకొండ ప్రాంతంలో పట్టాలు సమస్యను ప్రజలు నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.రాంబాబు, కె.సంతోషం, ఆర్.నాగేశ్వరరావు, కె.కిరీటం, ఎం.నాగేశ్వరావు, బి.శ్రీను, డాక్టర్ రమేష్‌కుమార్, ఎల్.బంగారునాయుడు, కష్ణవేణి, త్రినాథ్ పాల్గొన్నారు..

గుల్లలపాలెంలో...

ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధి గుల్లలపాలెంలో సిపిఎం మహిళా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. ఇళ్ల కోసం రూ.35 వేల నుంచి రూ.లక్ష వరకు డబ్బులు కట్టించుకున్నా ఇళ్లు, స్థలాలు ఇవ్వలేదని,ఉచిత గ్యాస్ డబ్బులు పడలేదని, విద్యుత్ ఛార్జీలు పెరిగాయని స్థానికులు సిపిఎం నాయకుల వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు బి.మమత, ఆర్.విమల, ఎం.నిర్మల, పి.ఈశ్వరమ్మ, పి.వరలక్ష్మి, పి.పోలమ్మ, సోను తదితరులు పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో...

జివిఎంసి 63వ వార్డు క్రాంతినగర్‌లో సిపిఎం మహిళా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలపై సర్వే చేశారు. కొండవాలు ప్రాంతంలో రోడ్లు, మెట్లు, రిటర్నింగ్ వాల్స్, విద్యుత్ స్తంభాలు, ఒంటరి మహిళల ఉపాధి, గ్యాస్ డబ్బులు పడలేదని తదితర సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు వై.కళ్యాణి, ఎం.జయలక్ష్మి, ఎన్.ఆదిలక్ష్మి, ఎస్.లక్ష్మి, కుమారి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు

శ్రామికనగర్‌లో...

పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి శ్రామికనగర్‌లో సిపిఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఇంటి పట్టాల సమస్యలను నాయకుల దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రమణి, సిఐటియు నాయకులు అప్పలనాయుడు, కాలనీ వాసులు చిరంజీవి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో సమస్యలు తెలుసుకున్న మహిళా నేతలు